

# కనుగొంటి... కనుగొంటీ...

**మేడా మస్తాన్‌రెడ్డి**

సాయంకాలం రావలసినవారు ఇప్పుడా రావడం? టైమెంతయిందనుకుంటున్నారు?" సాగదీస్తూ వాకిట్లోనే నిలదీసింది సహధర్మ చారిణి.

'టైమెంతయిందో నీకు తెలుసు. నా నోటితో చెప్పించడమెందుకు?" నా మనసులోని మాటలు గొంతు దాటాయిగానీ శబ్దరూపం దాల్చలేదు. దాల్చితే ఏమవుతుందో పూర్వానుభవం వల్ల తెలుసు.

ముందు గదిలో చదువుకుంటున్న పిల్లలిద్దరూ పుస్తకాల్లోంచి తలలు తిప్పి నావైపు చూస్తుండగా తల దించుకుని మునిపుంగవు డిలా లోనికి నడిచాను.

"ఆలుబిడ్డలు ఆధ్యాత్మిక చింతనకు అవరోధాలు. మోక్ష మార్గానికి అడ్డుగోడలు" అన్న స్వామీజీ మాటలు పదేపదే మెదులుతున్నాయి. 'నా మాటలు ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసేవారు, సత్యమార్గంలో పయనించడం మాట ఎలా ఉన్నా, కనీసం నా హితబోధనలను ఆచరణలో కూడా పెట్టలేరు."

ఎంత చక్కగా సెలవిచ్చారు. అందుకే ఉపన్యాసంలో సమయం నాకు తెలియకుండానే గడచిపోయింది.

స్వామీజీ మాటలు మననం చేసుకుంటూ స్నానం ముగించాను. సన్నగా గొణుక్కుం టున్నా, భోజనం మాత్రం కొసరికొసరి వడ్డించి తన బాధ్యత తీరినట్లుగా పడక గదిలోని పెద్ద లైటు ఆర్పి పడుకుంది శ్రీమతి. పిల్లలు ముందు గదిలో ఇంకా చదువు కుంటున్నారు. భోంచేసి నేనూ వెళ్ళి మంచానికి రెండో వైపు చేరబడ్డాను.

## నాకు పెళ్ళా! అంటున్న మీరాజాస్మిన్!



మీరా జాస్మిన్‌కి పెళ్ళయిందట! 'రన్' చిత్రంలో మాధవన్‌తో రన్ చేసిన ఈ భామ, మలయాళ నటుడు పృథ్వీని వివాహం చేసుకుందని పుకార్లు వినిపిస్తుండడంతో, నిజం తెలుసుకోవడానికి ఆమెని కదిపిన వారిని మాత్రం కొట్టినంత పని చేసిందట. "నాన్సెన్స్. నాకు అవకాశాలు బాగా వస్తున్నాయని, అది భరించలేని కొందరు పని గట్టుకుని కల్పిస్తున్న పుకార్లివి. అయినా పెళ్ళి చేసుకుని దాచాల్సిన పనేంటి?" అంటూ అడిగినవాళ్ళనే నానా తిట్లూ తిట్టిందట. ఈ విషయం గురించి ఆమె బంధువులను కదిపితే అవుననే సంగతి ఎలాగున్నా, కాదని మాత్రం చెప్పలేకపోతున్నారట!

మూడు రోజులుగా స్వామీజీ ఉపన్యాసాలు కాలేజీ మైదానంలో ఉన్నా, ఆఫీసు పని ఒత్తిడిలో వెళ్ళడం కుదరలేదు. ఇవాళ పని కాస్త తొందరగా ముగించి అట్నుంచి అటే వెళ్ళి ఉపన్యాసం విని వచ్చాను. పడుకున్నానేగానీ ఎంతకీ నిద్ర రావడం లేదు. స్వామీజీ అమృత వాక్యాలే నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆయనకు తెలియని విషయాలు ఈ భూ ప్రపంచంలో లేవనిపించింది. మూడు గంటల వ్యవధిలో చమక్కులు, చమత్కారాలు కథలు ఉదహరించారు. వారి బహుభాషా పరిజ్ఞానం అబ్బురపరిచింది. రామాయణ, భారత, భాగవతాదులేగాక వేదాంతం అష్టాదశ పురాణాలు, యోగా, చివరకు కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఉంది. ఎంతవరకు చదివారో, ఎన్నెన్ని పుస్తకాలను అధ్యయనం చేశారోగానీ, అన్ని వయసుల శ్రోతల్ని మంత్రముగ్ధుల్ని చేశారు.

* * *

పిల్లల గదిలో దీపం ఆరింది. అంటే సమయం పదకొండు గంటలు. బెడ్‌లైట్ వెలుగులో మా ఆవిడ కడిగిన ముత్యంలా ఉంది. అది అలసటో లేక ప్రశాంతతోగానీ హాయిగా, నిశ్చింతగా నిద్రపోతోంది. నేను స్వామీజీ మాటల్నే మననం చేసుకుంటూ బలవంతంగా నిద్రాదేవిని ఆహ్వానిస్తూ కళ్ళు మూసుకున్నాను.

"జీవితం నీటిబుడగవంటిది. బుడగగా ఉన్నంతకాలం అది తన ఇష్టం వచ్చినట్లు చుక్కాని లేని నావలా పయనిస్తూ ఉంటుంది. ఏ క్షణాన పగిలి నీటిలో కలిసిపోతుందో అప్పుడు అది తన ఉనికిని కోల్పోతుంది. ఆ బుడగే జీవాత్మ. ఆ నీరే పరమాత్మ."

నా గుండెలో కొంచెం నొప్పిగా అనిపించి కుడిపక్కకు తిరిగి పడుకున్నవాడిని ఎడమవైపు ఒత్తిగిల్లాను.

"పునరపి జననం.. పునరపి మరణం. పుట్టినవాళ్ళు గిట్టక తప్పదు. ఈ లోకంలోకి ఒంటరిగా వచ్చిన నీవు పోయేటప్పుడూ ఒంటరిగానే పోతావు. వెంట ఏమీ తీసుకెళ్ళవు."

గుండెల్లో నొప్పి ఎక్కువైనట్లు అనిపించింది. మా ఆవిడ్ని లేపుదామా అనుకున్నాను. తనకు ఇప్పుడు నిద్రాభంగం అయితే రేపు మా ఇంటిల్లిపాదీ కార్య క్రమాలన్నింటికీ భంగం వాటిల్లే ప్రమాదం గ్రహించి, ఊహించి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాను.

"కర్మ చేతనే జీవుల పుట్టుక, మరణం సంభవిస్తాయి. స్త్రీ గర్భంలో ఏడవ నెలలో ప్రవేశించి ఊపిరి పోసుకునే జీవాత్మ ఆ చీకటి గుహలోంచి బయటపడేవరకు అనుక్షణం క్షణ క్షణం భగవంతుని స్మరిస్తూనే ఉండి, నెలలు నిండి 'కేర్.. కేర్..' మంటూ భూమ్మీదకు రాగానే మాయలోపడి ఆ పరమాత్ముని 'డోంట్ కేర్' అంటుంది."

ఛాతీలో నొప్పి భరించలేక గుండెమీద చేత్తో రాసుకుంటూ నెమ్మదిగా వెల్లకిలా పడుకున్నాను.

'జీవిత చరమాంకంలో యమభటులు ఎదురుగా నిలిచేంత వరకూ పశ్చాత్తాపం స్వార్థరహిత భక్తి కలగవు."

"క్లింగ్'మని గాజు జాడీ కిందపడి పగిలిన చప్పుడుతోపాటు నా నోట్లోంచి 'అమ్మా' అని చిన్నగా కేక వచ్చింది.

* * *

ఇప్పుడు స్వామీజీ మాటలు వినిపించడం లేదు. నా శరీరం నాకు మంచంమీద కనిపిస్తోంది. డ్రెస్సింగ్ టేబుల్ నిలువుటద్దంలో చూసుకున్నాను. ఆశ్చర్యం. నా ప్రతిబింబం నాకు కనిపించడంలేదు. శూన్యం. నేను లేనా! అయినా నా ఆకారం ఆలోచించకుండా నాకు ఈ ఆలోచనలు ఏమిటి? అంటే శరీరాన్ని వదిలానన్న మాట. అయితే లోకం దృష్టిలో చనిపోయానా? అవును. అంతే...

* * *

నా శరీరం చుట్టూ చేరి నా భార్యా బిడ్డలు రోదిస్తున్నారు. కడుపు కోత భరించలేని ముసలి కన్నతల్లిని ఓదార్చే ధైర్యం లేకపోయింది బంధు మిత్రులకు. నేనిప్పుడు ఆత్మను. స్థూలంలోంచి సూక్ష్మరూపంలోకి మారిన జీవాత్మను. కాసేపట్లో పరమాత్మలో లీనమైపోతాను. ఎన్ని షోకులు చేసుకుందో నా శరీరం. పాపం శవంలా పడి ఉంది – లా .. ఏమిటి? శవమే.

ఇదేమిటి? ఇలా తేలికైపోతున్నాను. భార్యబిడ్డలకు దూరమై, గాలికంటే, ఆలోచనలకంటే వేగంగా ఎగిరిపోతున్నాను. ఏవేవో తెలియని లోకాలను దాటుకుంటూ వాటిని వీక్షిస్తూ ఎక్కడికో ఏవైపో పయనిస్తున్నాను. చుట్టూ అంతా చల్లని వెన్నెలలాంటి వెలుతురు. కోట్లాది విద్యుత్ బల్బుల కాంతి కూడా ఆ వెలుగు ముందు దిగదుడుపే అనిపించింది. ఎక్కడా చూచాయగానైనా 'ఛాయ' లేదు. అక్కడ సంచరిస్తున్నవాళ్ళు ఆ వెలుగులో మరింత ప్రకాశవంతంగా వెలుగుతూ కనిపిస్తున్నారు. కళ్ళు మిరుమిట్లుగొలిపే అంతటి కాంతిలో కూడా వారు కనురెప్పలు వేయడం లేదు. వారు అనిమిషులు కాబోలు. ఆ దేవీదేవతలు ఎవరి ఆనందంలో వారున్నారు. నన్నెవరూ పట్టించుకోలేదు.

అక్కడి నుండి సూర్యచంద్ర నక్షత్ర మండలాలు దాటి "పరంధామ థామం"లో వాలాను. అంతే, నాలో దుఃఖం ఒక్కసారి పెల్లుబికింది.

"ప్రభూ! ప్రభూ!" అంటూ బిగ్గరగా విలపించసాగాను.

'ఓ జీవాత్మా!' అశరీరవాణిలోంచి అచ్చ తెలుగులో పిలుపు నాకెంతో ఇష్టమైన అమరగాయకుడు ఘంటసాల గొంతులా ఉంది. దైవంలో ఐక్యమైపోయిన గాన గంధర్వుడు ఆయన. భగవంతుడు ఎవరికి ఇష్టమైన రూపంలో వారికి కనబడుతాడని విన్నానుగానీ, వారికి ఇష్టమైన గొంతుతో కూడా వినబడతాడని ఇప్పుడే తెలిసింది.

నీ జీవిత కాలంలో కొంత పుణ్యం చేశావు. కాబట్టి నా వరకూ తెలివితో రాగలిగావు. నా వాక్కు వినగలిగావు. మళ్ళీ వినిపించింది. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నేను చేసిన పుణ్యం ఏమై ఉంటుందో ఎంత ఆలోచించినా స్ఫురించలేదు, ఒకటి రెండు పాపాలు తప్ప. "అయినా నీకు మానవజన్మ మీద ప్రీతి పోలేదు. నీ కర్మలు పరిపక్వం కాలేదు. అందుకే నా సమక్షంలో కూడా నీకు ఏకాగ్రత లోపించింది.

[illegible] పిపీలికాది పశు పక్ష్యాదులైన ఎనభై నాలుగు లక్షల జీవుల్లో ఉన్నతమైన మానవ జన్మను నీకు మళ్ళీ ప్రసాదిస్తున్నాను. ఈ జన్మకైనా నిష్కామకర్మలను ఆచరిస్తూ, సదా నన్నే స్మరిస్తూ నాలో లీనమయ్యేందుకు ప్రయత్నించి జన్మరాహి త్యం చేసుకో..."

"స్వామీ!" అంటూ అడ్డుకోబోయాను.

"గ్రహించాను. ఏ తల్లి గర్భంలో ప్రవేశించి, ఏ లింగ రూపంలో జన్మించాలను కుంటున్నావో నీ అభీష్టానికే వదిలివేస్తున్నాను. వెళ్ళిరా...!" మాటలు ఆగిపోయాయి.

అప్పటికే నేను బరువెక్కి పైకి వెళ్ళిన వేగం కంటే రెట్టింపు వేగంతో కిందకు పడిపోసాగాను. వెళ్ళేటప్పుడు చూసిన విచిత్ర లోకాలు ఏవీ కనిపించడంలేదు. అంతా చీకటి. మాయ తన ప్రభావం చూపించడం మొదలుపెట్టినట్లుంది. భూకక్ష్యలో ప్రవేశించి నాకు ఇష్టమైన నా మాతృభూమిలో ఓ మాతృదేవత కోసం అన్వేషణ ప్రారంభించాను.

* * *

సముద్రతీరంలోని ఓ మారుమూల ప్రాంతం. ఆ గ్రామ వాతావరణం అక్కడివాళ్ళ కట్టూబొట్టూ చూస్తే ఆంధ్రదేశం కాదనిపించింది. వినిపించే భాషను బట్టి తమిళనాడుగా గుర్తించాను. అరవదేశంలో ఆడపిల్లగా పుట్టి జడ వేసుకుని పూలు పెట్టుకోవాలనే కోరికను తీర్చుకుందామని పించింది.

ఓ పెంకుటింట్లో యాభై ఏళ్ళు దాటిన మహిళ అరుగుమీద కూర్చుని తమలపాకులపై సున్నం రాసుకుంటూ అదే పనిగా తాంబూలం నములుతూ, ఆమె ముందు కూర్చున్నామెతో... తమిళంలో

"ఈ కాన్పుకైనా మగ పిల్లాండు పుడితిడా సరిదాన్... బతికాడు. ఆడ గుడ్డు పుట్టిందో అవ్వళవుదాన్... పురిట్లోనే దాని నోట్లో వడ్లగింజ కుక్కి గుటుక్కుమనిపించి పిల్ల చచ్చి పుట్టిందని చాటింపేయిస్తా" అంటూ నోట్లోని రక్తవర్ణంలో ఉన్న లాలాజలాన్ని తుప్పున బయటకు ఉమ్మింది. ఆ రాక్షసి ఓ కోడలికి అత్తగారయి ఉంటుంది. అంటే కోడలు కడుపుతో ఉందన్న మాట. భగవంతుని దర్శనభాగ్యమో లేక పూర్వజన్మ సుకృతమో, అది అరవమైనా అర్థమయింది కాబట్టి బతికిపోయాను. లేకుంటే మళ్ళీ చావొచ్చేది. ఈ చుట్టుపక్కల ఉండకుండా పారిపోవాలి. కాదు... కాదు... ఎగిరిపోవాలి. ఎక్కడికైనా ఎక్కడికో ఎందుకూ? ఆంధ్ర ప్రాంతమైన త్రిలింగ దేశానికే పోతే...

* * *

అది తెలంగాణాలోని తండాలు, లంబాడీలు


ప్రియదత్త ప్రియ పాఠకులకు

అద్భుత చారిత్రక సీరియల్

# స్వరసంధ్య

దీపకరాగంతో దీపాలను వెలిగించి, మేఘమలర్‌తో వర్షాలను కురిపించిన అపూర్వ గంధర్వ గాయకుడు 'తాన్‌సేన్' జీవితగాథ. అడుగడుగునా ఆసక్తికరమైన విశేషాలతో, విచిత్రాలతో రమ్యంగా సాగే రచన.



ప్రముఖ నవలా రచయిత

డాక్టర్ సి.వి. కొండయ్య కలం నుంచి

జాలువారిన గొప్ప పరిశోధనాత్మక నవల

త్వరలోనే ప్రారంభిస్తున్నాము

(గతంలో ఈ రచయిత రాసిన 'ఖజురహో' చారిత్రక పరిశోధనా నవల ఒక ప్రముఖ వారపత్రికలో సీరియల్‌గా ప్రచురింపబడి సంచలనం సృష్టించి, ఆంధ్ర పాఠకుల అభినందనలందుకుంది)

నివిసించేగూడెం. ఓ గర్భిణితో ఆవిడ భర్త అంటున్న మాటలు వినిపించాయి.

"పోయినేడు పుట్టిన కూనను వెయ్యి రూపాయలకు దొరసానమ్మకు అమ్మాను. ధరలు పెరిగాయి గందా. ఈ సారి పుట్టే బిడ్డను పదిహేను వందలకు పటేలోళ్ళ రెడ్డిసానమ్మకు ఇచ్చేనంటే ఉన్న అప్పులు తీరిపోయి ఈ ఏడు కూడా కల్లు తాగుతూ సల్లగా గడిసిపోద్ది..."

ఆమె బతిమాలుతున్నట్టు దీనంగా, "ఈ పాలికి ఒగ్గేయ్ మావా! పుట్టే బుడతను ఎట్టాగైనా పెంచుకోవాలని ముచ్చటగా ఉన్నాది' అంది.

"నోర్మూయమే! ఈల్లేదంటే ఈల్లేదంతే' తెగేసి చెప్పేశాడు త్రాగుబోతయిన ఆ మొగుడన్న మగాడు.

కనేది ఒకరు, అమ్మేది ఒకరు, పాలిచ్చేదొకరు, పాలించేదొకరు... వామ్మో! ఇక్కడ ఒక్క క్షణం కూడా ఉండకూడదు. ఎగరెళ్ళిపోవాలి

* * *

"ఒక్కడ్ని చేసి నిర్దాక్షిణ్యంగా నా కొడుకును నరికి నీళ్ళోసుకున్న నా కోడల్ని విధవను చేశార్రా! ఆ వెధవ నాయాళ్ళు. చూస్తుండండి. నాకు మనవడు పుట్టినా, మనవరాలే పుట్టినా వాళ్ళతోటే ఆ రాయుడి కాష్టం కాల్పిస్తా. లేకుంటే మీ పాత మెట్టెతో నన్ను కొట్టండి. ఖబడ్దార్... ఇదే నా శపథం" మీసం మెలేస్తూ ఓ ముసలాయన తన అనుచర గణం ముందు సింహగర్జన చేస్తూ చిందులేస్తున్నాడు.

అయ్య బాబోయ్! సీమ ఫ్యాక్షనిజం, రగిలే పగలు, పగలే పగిలే బాంబులు, రక్తపాతాలు, చంపుకోవడాలు, – ఇలాంటి ఊరిలో పుట్టి పెరిగేకంటే ఏ అడవుల్లోనో ప్రశాంతంగా బ్రతక వచ్చు. అవును... అడవుల్లోకే ఎగిరిపోవాలి.

* * *

దట్టమైన అడవి. ఎత్తయిన కొండలు, మధ్యలో మెరుపు రేఖలా సెలయేరు పారుతోంది. అక్కడున్న వాళ్ళంతా ఆడా మగా తేడా లేకుండా ప్యాంట్లూ, షర్టులూ వేసుకున్నారు. అందరి చేతుల్లోనూ చిన్నదో పెద్దదో ఒక తుపాకీ ఉంది. కొందరు తుపాకులే తలగడలుగా చేసుకుని నిద్రపోతున్నారు. కాపలా కాస్తున్న ఇద్దరు మహిళలు ఇలా మాట్లాడుకుంటున్నారు :

"రెండు రోజుల క్రితం వెళ్ళిన పెద్దన్న ఇంతవరకూ తిరిగి రాలేదు. పథకం ప్రకారం వాళ్ళను చంపాడో, లేక పోలీసు కాల్పుల్లో తనే పోయాడో తెల్వదు... ప్చ్....

ఆ గొడవలు మనకెందుకు చిట్టెక్కా? మన చిన్నక్కకు నెలలు నిండుతున్నాయి గందా! కాన్పు అయ్యాక ఆ పుట్టే పోరడ్ని ఉద్యమానికి అంకిత మిస్తుందంటావా? లేక లొంగిపోయి పట్టణంలో ఇంగ్లీషుచదువులతో పెంచుకుంటుం దంటావా?"


"పై వాళ్ళను చంపినా, తనవాళ్ళను చంపుకున్నా, లొంగిపోవాలన్నా మనకు ముసలన్న మాటే వేదం. ఆయన ఎట్టా చెప్తే గట్టా సేత్తారనిపిస్తోంది."

సంభాషణ ఆగింది.

ఓర్నాయనో... వీళ్ళ వరసలు, మాటలు వింటుంటే, చంపడం చంపించుకోవడం తప్ప వేరే కార్యక్రమాలు లేనట్లుంది. నాకొద్దు ఈ చావు జన్మ. ఇంకెక్కడికైనా వెళ్ళిపోవాలి. పోవాలి...

* * *

పరాయిదేశం వెళ్ళడం ఇష్టంలేక మాతృదేశమంతా తిరిగాను. ఆశ్రమాల్లోకి కూడా తొంగిచూశాను. అవి అధికార పీఠం కోసం కుమ్ములాటలతో మూడు కుట్రలూ, ఆరు కుతంత్రాలతో కుతకుతలాడుతూ, బయటకు మాత్రం మేడిపండులా కనబడు తున్నాయి. ప్రశాంతంగానే కనబడుతున్నా కరుణ, ప్రేమ, దయ, సౌభ్రాతృత్వం కలగలిసి ఉండే చోటు లేనట్లే ఉంది. నా గమ్యం అగమ్యగోచరమైంది.




వీటన్నింటికంటే పాత శరీరమే నయమనిపించి క్రితం జన్మలోని ఇంటికేసి చూశాను.

అప్పటికే నా కాయం కాష్టంలో మండి, బూడిద బంగాళాఖాతంలో కలిసి ఫోటోకి దండ కూడా పడి ఉంది. ఆ కుటుంబం నా ఇన్సూరెన్సు డబ్బులతో ముందుకంటే సుఖంగా ఉంది. ఇక నాకు సంతృప్తినిచ్చే జన్మ దొరికేట్టు లేదు.

"ఓ ప్రభూ! దేవా! నాకు మళ్ళీ జన్మ వద్దు. నన్ను నీలో కలుపుకో. పరమాత్మా! తండ్రీ" ఆవేదనతో పెద్దగా పెనుగులాడుతూ అరిచాను.

* * *

"అర్థంపర్థం లేని పుక్కిటి పురాణాలు విని బుర్ర పాడు చేసుకోవద్దని నెత్తీ నోరు కొట్టుకుని చెబితే వినరు కదా!" కలలో కూడా కలవరపరచే మా ఆవిడ స్వరం వినపడింది. ఓ చేత్తో నా భుజం కుదుపుతూ "ప్రభూ! దేవా" అంటూ ఏమిటా అర్ధరాత్రి అరుపులు, పలవరింతలు? పాడుపిల్ల పింగాణీ జాడీ పగులగొట్టి వెళ్ళింది. నే వెళ్ళి సర్ది వచ్చేసరికి ఇక్కడ మీ గోల, కేకలూనూ..." విసుక్కుంటూ ప్రక్కన పడుకుంది.

కలవరపడి కలలోంచి బయటపడ్డాను.

'కాస్త ఛాతీనొప్పిగా ఉంది' అన్నాను తడబడుతూ మెల్లగా. మా ఆవిడ ఆదుర్దాతో నా గుండెల మీద చేయి వేసి, "అయ్యా అయ్యో... ఒళ్ళు ఇలా పేలిపోతోందేమిటి? ఇంత జ్వరం ఒకేసారి ఎలా వచ్చిందబ్బా? పాడు? అని సణుగుతూ పిల్లల్ని, మా అమ్మనీ లేపి హడావిడి చేసింది.

పెద్దాడు డాక్టరుకి ఫోన్ చేసి వచ్చి నా కాళ్ళ వద్ద కూర్చుని కాళ్ళు పడుతున్నాడు. అమ్మాయి అమృతాంజనం తీసి గుండెలపై నెమ్మదిగా చేత్తో రాస్తూ దీనంగా నాకేసి చూస్తోంది. మా ఆవిడ తడిబట్ట మడిచి నా నుదుటి మీద పెట్టి అది ఆరిపోతుంటే తీసి తడి చేసి మళ్ళీ వేస్తోంది. అమ్మ ఆప్యాయంగా తల నిమురుతూ కళ్ళ నీళ్ళతో తలవైపు కూర్చుంది.

"ఆరు బయట మంచులో తడవడం మీ ఒంటికి పడదంటే వినిపించుకోరు గదా!" శ్రీమతి కళ్ళల్లో తడిని చూశాను.

ఆజన్మ బ్రహ్మచారి కాబట్టి స్వామీజీ అలా సెలవిచ్చారుగానీ, భార్యాబిడ్డలు సంసార బంధాలు దేనికీ అవరోధాలు కావు. అవి సృష్టిలో మానవజాతి వికాసానికి మార్గాలు. గృహస్థాశ్రమానికి మించిన సౌఖ్యం లేదు. అని నిర్ధారించుకున్నాను. రేపు స్వామీజీ ఉపన్యాసానికి వెళ్ళాలా మానాలా అని సందిగ్ధావస్థలో ఉండగా డాక్టరుగారు వచ్చి ఇంజెక్షను ఇచ్చారు. ఏదో కొత్త విషయం కనుగొన్న ఆనందంతో తృప్తిగా నిద్రాదేవి ఒడిలో ఒదిగిపోయాను. ☆